

## ఓ టి.వి. కథ

# మల్లాది వెంకటకృష్ణమూర్తి

మాధవీలతకి చాలా కాలంగా వున్న చిన్న కోరిక ఓ పెద్ద వస్తువు మీద. అది ఆమె భర్త కొనిచ్చే తాహతులేని వస్తువు - టి.వి.

అంతా 'తెనాలి రామకృష్ణ' సీరియల్ బావుందనో, 'ఆనందో బ్రహ్మ' అదరహాలా వుందనో చెప్పుకుంటున్నా, 'చిత్రలహరి'లో ఎన్టీఆర్ పాటవేశారని వుత్సాహంగా అనుకుంటున్నా మాధవీలత తెల్లమొహం వేసుకుని వింటుంది. మేటర్ ఆఫ్ ప్రిన్సిపుల్‌గా ఆమె పరాయి వాళ్ళింటికి వెళ్ళి టి.వి. చూడదు. ఇతరులకి సౌకర్యం తప్ప అసౌకర్యం కలిగించడం ఆమెకి ఇష్టం వుండదు.

చాలా కాలం నించి మాధవీలత భర్తకి కూడా టి.వి. ఒకటి ఇంట్లో వుంటే బావుండును అని వుంది. అందుకే జి.పి.ఎఫ్. లోంచి ఎంత అవసరం వున్నా డబ్బు విత్ డ్రా చేయడం లేదు.

తన బంధువులకి, స్నేహితులకి, కొలీగ్స్‌కి, తన ఆఫీసులో పని మీద వచ్చే పబ్లిక్‌కి అతను సందర్భం వచ్చినప్పుడల్లా చెప్తుంటాడు.

"నా దగ్గర ఆరువేలు సిద్ధంగా వున్నాయి. ఇంకో అయిదు వేలు అప్పు దొరికితే ఏకంగా కలర్ టి.వి. తీసుకోవాలను కుంటున్నాను."

ఒక్కసారిగా అయిదువేలు అప్పు పెట్టే స్థోమతగల ఫ్రెండ్స్ ఎవరూ అతనికిలేరు. మాధవీలత బ్లాక్ అండ్ వైట్ కొనడానికి ఇష్టపడలేదు.

"అది అమ్మితే బోలెడంత నష్టం. మళ్ళీ అది అమ్మి కలర్ టి.వి.ని జీవితంలో కొనలేం. ఎంత కాలమైనా ఆగి కలర్ టి.వి.నే కొందామండి" చెప్పేది ఆమె భర్త "పోనీ బ్లాక్ అండ్ వైట్ టి.వి.నే కొందాం" అన్నప్పుడల్లా.

ఓ రోజు మాధవీలత భర్తతో చెప్పాడు అతని ఆఫీసుకి వచ్చిన ఒకతను కేజువల్‌గా_

"మీకు కలర్ టి.వి.కి ఎంత తక్కువ పడిందన్నారు?"

"అయిదు వేలు" చెప్పాడతను.

"నేను అయిదు వేలు సర్దుతాను. కాకపోతే ఎంత కాలంలో ఎన్ని ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో తిరిగి పే చేస్తారో క్లియర్‌గా చెప్పాలి మీరు."

మాధవీలత భర్తకి, అతనికి ఆరేళ్ళుగా పరిచయం.

తను నాలుగేళ్ళలో ఆ మొత్తం తీర్చేయగలనని చెప్పాడు.

"మీరు మిగతా ఆరువేలు సిద్ధం చేసుకున్నాక చెప్పండి. అయిదు వేలిస్తాను. కాకపోతే పత్రం రాసివ్వాలి. వడ్డీ తీసుకోను. అసలుకి రాసిస్తే చాలు."

జి.పి.ఎఫ్.కి అప్లై చేశాడు, ఫెస్టివల్ అడ్వాన్స్‌కి అప్లై చేశాడు. పది రోజుల్లో మాధవీలత భర్త ఆరువేలు డ్రా చేసి ఇంటికి తీసుకెళ్ళాడు. మాధవీలతకి చెప్పాడు మిగతా అయిదువేల గురించి. ఇద్దరూ ఎంతో సంబరంగా ఏ టి.వి. కొనాలో మాట్లాడుకున్నారు. తమ టి.వి.లో అందరిలా సిద్ధార్థ బసు క్విజ్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చూడచ్చు అని సంతోషపడింది.

మర్నాడు ఉదయం ఒకతను మాధవీలత ఇంటికి వచ్చి అయిదువేలు ఇచ్చి చెప్పాడు.

"అమ్మగారూ! అయ్యగారు ఈ అయిదువేలు ఇంట్లో వుంచమన్నారు. సాయంత్రం ఆరింటికి మిమ్మల్ని తయారుగా వుండమన్నారు టి.వి. కొనడానికి తీసుకెళ్తారుట."

మాధవీలతకి ఎంతో సంతోషంగా వుంది. సాయంత్రం ఆరెప్పుడవుతుందా అని ఎదురు చూడసాగింది.

సరిగ్గా నాలుగున్నరకి వచ్చాడా అయిదు వేలు ఇచ్చినతను మళ్ళీ.

"అమ్మగారూ అయ్యగారికి డయొనారా టి.వి. ఫిఫ్టీన్ పర్సెంట్ డిస్కౌంట్‌లో కలర్ ఇస్తున్నారుట. అది కొన్నారు, ఇంకో అరగంటలో రిక్షాలో వస్తుందని చెప్పమన్నారు."

"అలాగా?"

టి.వి. ఇంకో అరగంటలో వస్తోందంటే ఎంతో థ్రిల్ ఫీలైంది మాధవీలత.

"అయ్యగారు ఈ మొత్తం తీసుకురమ్మన్నారండి" అని ఓ కాగితం ఇచ్చాడు.

దాంట్లో టి.వి. ధర, డిస్కౌంట్ పోను ఎంతివ్వాలో వుంది.

మాధవీలత భర్త పేరు మీద రాసిన బిల్ అది.

మాధవీలత పదివేల ఆరు వందల డబ్బై ఒక్క రూపాయిలు లెక్కపెట్టి ఇచ్చింది అతనికి.

సాయంత్రం ఆరింటికి భర్త రాగానే అడిగింది.

"టి.వి. ఇంకా రాలేదండి. కాస్త కనుక్కోండి."

"టి.వి.రావడం ఏమిటి?" అడిగాడు అతను.

మాధవీలత జరిగింది చెప్పింది.

"ఓసి ఏబ్రాసి మొహమా? వాడెవడో నిన్ను నమ్మించి, మోసం చేసి ఆ డబ్బు పట్టుకెళ్ళాడే. నేను ఎవర్నీ పంపలేదు" చెప్పాడు మాధవీలత భర్త ఏడుపుగొంతుతో.

●





23-2-90 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక